

ఆరిలోవ భగత్‌సింగ్‌నగర్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



ఆళ్వార్‌దాస్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తదితరులు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న కలెక్టర్ మల్లికార్జున



ఆరిలోవ గాంధీనగర్ ఎంపీపీ స్కూల్ కేంద్రంలో క్యూలో ఓటర్లు



ఆరిలోవ భగత్‌సింగ్‌నగర్ పాఠశాల కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు బారులు తీరిన ఓటర్లు

పోటెత్తిన ఓటర్లు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన వృద్ధులు
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- మందకొడిగా సాగిన పోలింగ్



గాంధీనగర్‌లో వృద్ధుడు లక్ష్మణయ్యను ఓటు వేయడానికి తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు



సమత కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్



ఆరిలోవ సెయింట్ ఆన్స్ స్కూల్ కేంద్రంలో క్యూలో ఓటర్లు





వృద్ధులను ఓటు వేయడానికి తీసుకెళ్తున్న బంధువులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో చిన్నపాటి అల్లర్ల మినహా సాధారణ సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియాల్సి ఉండగా.. కొన్ని చోట్ల రాత్రి 8 గంటలు, మరికొన్ని చోట్ల రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. కొన్ని బూత్‌లలో 1300 దాటి ఓటర్లు ఉండడం, మరికొన్ని బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఆయా బూత్‌లలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఎంత సమయమైనా ఓటర్లు ఓపికతో క్యూలో నిలబడి తమ ఓటు హక్కు వినియోగించుకుని చైతన్యం చాటారు. ముందుగా గుర్తించిన 11 చోట్ల సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనంగా పోలీసు బందోబస్తు నిర్వహించడంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలింగ్ జరిగింది. ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ తీవ్రత దృష్ట్యా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన టెంట్లలో ఓటర్లు బారులు తీరారు. మంచినీటి సౌకర్యంతో పాటు ఫస్ట్ ఎయిడ్ సౌకర్యం కల్పించారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు సైతం కుటుంబ సభ్యుల సహకారంతో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. గాంధీనగర్‌లో లక్ష్మణయ్య అనే 80 ఏళ్ల పైబడిన వృద్ధుడు పూర్తిగా నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఆయనను అతని కుటుంబ సభ్యులు మోసుకొచ్చి ఓటు వేయించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్న సమయంలో పోలింగ్ కేంద్రాలు ఖాళీగా కనిపించినా, తిరిగి సాయంత్రంకు క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్ పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు చేశారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వేర్వేరు లైన్లుగా ఏర్పాటు చేసి, కేంద్రాల్లోకి పంపించారు. ఈ సారి యువత పెద్ద ఎత్తున ఓటు వేసేందుకు తరలిరావడంతో గతంలో కన్నా పోలింగ్ శాతం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తదితరులు పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

కొత్త ఓటర్ల ఉత్సాహం

ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్ల ఉత్సాహం కనిపించింది. సుమారు 20 వేల మంది యువతకు కొత్తగా ఓటు హక్కు లభించింది. దీంతో వారంతా మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహం కనబరిచారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఓటు వేయడానికి బారులు తీరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వారి సందడి కనిపించింది.

ఏయూ క్యాంపస్: నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పక్కాగా చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రం నంబరు, వరుస నంబరు ఆధారంగా తమ పోలింగ్ కేంద్రాన్ని గుర్తించడానికి హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒకే పాఠశాలలో ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్నప్పుడు తమ పోలింగ్ కేంద్రాన్ని సులభంగా గుర్తించడానికి ఈ సెంటర్లు దోహదపడ్డాయి.

ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అమోఘం

ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను పోలింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం చేశారు. వృద్ధులకు అవసరమైన సమాచారం అందిస్తూ వారి చేయి పట్టుకుని పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లారు. ఎన్‌సీసీ విద్యార్థులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సహకారం అందించారు.

భానుడు ప్రతాపం

ఇటీవల వరకు వాతావరణం కొంత చల్లబడినా మంగళవారం ఎండ తీవ్రత కాస్త పెరిగింది. ఉదయం 10 గంటల్లోపు అధిక శాతం మంది ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పోలింగ్ కాస్త ఆలస్యమైంది. అనంతరం ఓటర్లు మందకొడిగా పోలింగ్ కేంద్రాలకు రావడం కనిపించింది.

64.73%
2019లో పోలింగ్
68.50%
2024లో పోలింగ్ (రాత్రి 10 గంటల వరకు)



తొలిసారి ఓటేసిన ఆనందంలో హర్షవర్ధన్, సాయి సంపత్

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



ఓట్ వేసి సిరాగుర్తు చూపిస్తున్న వెలగపూడి

బీచ్ రోడ్డు: సార్వత్రిక ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా సోమవారం జీవీఎంసీ 19వ వార్డు లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం పోలింగ్ బూత్ నంబర్–132లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోపాలపురం పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు, ఎంవీవీ సతీమణి ముళ్ళపూడి నాగజ్యోతి, పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్, రవి కిరణ్‌రెడ్డి, తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు.

- ఆరిలోవలోని తోటగరువు హైస్కూల్‌లో బూత్ నంబర్–52లో విశాఖ నగర మేయర్ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.
- కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున తన ఓటును చినవాల్తేరులోని కోటక్ స్కూల్‌లో సాధారణ ఓటరులా క్యూలో నిల్చుని ఓటు వేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ తన ఓటు హక్కును ఏయూ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. రామ్‌నగర్‌లోని సదరన్ స్కూల్‌లో రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తమ ఓటును వినియోగించుకున్నారు.

పదనిసలు

- ఉదయం 7 గంటలకు పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభం కాగా, మరికొన్ని కేంద్రాల్లో ఐదారు నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- కేడీపీఎం పాఠశాలలోని 158, 159 రెండు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు కాసేపు మొరాయించాయి. దీంతో ఓటర్లు కాస్త అసహనానికి గురయ్యారు. తరువాత వీటిని సరిచేయడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఇక్కడ వేసిన టెంట్‌లు ఓటర్లకు సరిపోలేదు. తాగునీరు సదుపాయం కూడా కల్పించలేదని ఓటర్లు వాపోయారు.
- నౌకానగర్ పాఠశాలలో ఉదయం 11 గంటల సమయంలో భారీగా ఓటర్లు రావడంతో క్యూలైన్ రోడ్డు మీదకు వచ్చింది. ఎండలో నిల్చుని సైతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. తరువాత ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం గమనించి, రోడ్డుపై టెంట్ వేశారు.
- శివాజీపాలెంలోని ఏయూ ఫైన్స్ ఆర్ట్స్ విభాగం, ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను గుర్తించడానికి ఓటర్లు కాస్త ఇబ్బంది పడ్డారు. వారికి వలంటీర్లు సహకారం అందించారు. అదే విధంగా వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వద్ద వాహనాలను నిలిపివేసి నడిచి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో మధ్యాహ్న సమయంలో ఓటు వేయడానికి వచ్చిన వారు కాస్త ఇబ్బంది పడ్డారు.
- ఏయూ పాఠశాలలో 189, 191 పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు ఉండడంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు.

ఎంవీపీలో ప్రశాంతం

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికలు ఎంవీపీ కాలనీలో ప్రశాంత వాతావరణం మధ్య జరిగాయి. చిన్న చిన్న సంఘటనల మినహా ఎంవీపీ కాలనీ పరిధిలో 17, 18, 19 వార్డుల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 17, 18 వార్డుల్లో 45 వరకు పోలింగ్ కేంద్రాలు ఉండగా పలు చోట్ల రెండుకు మించి కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో ఏఎస్ రాజా కళాశాల, సమతా కళాశాల, గిరిజన భవన్, అల్వార్ దాస్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో ఓటర్ల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఎక్కువ పోలింగ్ బూత్‌ల కారణంగా జనం ఎండలో నిరీక్షించి ఓటేయాల్సి వచ్చింది. తూర్పు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా 19వ వార్డు శాంతి ఆశ్రమంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు గిరిజన భవన్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమత కళాశాల పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభిమానులు ఓటు వేసేందుకు వెళుతుంటే అడ్డుకున్నారనే ఆరోపణతో ఇరువర్గాల వాగ్వాదానికి దిగారు. సాయంత్రం సమతా కళాశాల, ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూళ్లలోని పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ సందర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పేర్ల విజయచందర్, వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 15, 16, 23వ వార్డుల్లో పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 273 పోలింగ్ బూత్ వద్ద మాత్రం నిర్ణీత సమయం 6 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇదే వార్డులో అంబేడ్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 270 కేంద్రంలో, అంగన్‌వాడీ కేంద్రంలోని 271 కేంద్రంలో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా వందలాది మంది ఓటర్లు బారులు తీరారు. 16వ వార్డు రజకవీధి కమ్యూనిటీ హాల్‌లో 267 పోలింగ్, అంగన్‌వాడీ కేంద్రంలోని 264, అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్నికల ప్రకియ రాత్రి వరకూ కొనసాగింది.

జోరువానలో పోలింగ్

సాయంత్రం 6 గంటల తరువాత క్యూలో ఉన్న ఓటర్లతో పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఇంతలో భారీ వర్షం కురిసింది. అయినా ఓటర్ల వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లోనే ఉన్నారు.



16వ వార్డు అంబేడ్కర్ కాలనీలో బారులు తీరిన ఓటర్లు



నౌకానగర్ పాఠశాలలో రోడ్డుపై క్యూలో ఉన్న ఓటర్లు

విశాఖ తూర్పులో నమోదైన పోలింగ్ శాతం

సమయం	పోలింగ్ శాతం
ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య	9.40%
ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య	23.01%
ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ	37.51%
మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకూ	50.41%
మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ	60.53%
సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు	68.50%

గాంధీనగర్‌లో టీడీపీ నాయకుల హంగామా



పోలింగ్ కేంద్రం నుంచి కానిస్టేబుల్‌ను బయటకు నెట్టుకొస్తున్న 11వ వార్డు టీడీపీ కార్యకర్తలు



కానిస్టేబుల్‌తో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆరు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ పరిస్థితులను బట్టి పోలీసులు ముందుగానే సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించారు. దీంతో అదనంగా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అయినా టీడీపీ నాయకుల హడావుడి ఆగలేదు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించి అక్కడ ఓటర్ల ఆగ్రహానికి గురయ్యారు. ఇక్కడ 46వ నంబరు బూత్ వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ను ఓ ఓటరు తన స్లిప్ చూపించి ఏ బూత్ వద్దకు వెళ్లాలో అడిగాడు. ఆయనకు కానిస్టేబుల్ సంబంధించిన బూత్ చూపించారు. అక్కడ ఉన్న కొందరు టీడీపీ కార్యకర్తలు దాన్ని రాద్ధాంతం చేస్తూ ఆ కానిస్టేబుల్ వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని ప్రచారం చేస్తున్నాడంటూ హడావిడి చేశారు. అంతటితో ఆగకుండా ఆ కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్నారు. కానిస్టేబుల్‌ను బయటకు తోసుకొంటూ వచ్చారు. బయటకు తీసుకొచ్చిన అనంతరం ఆ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై టీడీపీ కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించడంపై పోలీసులు మండిపడుతున్నారు. వారిపై ఎన్నికల కమిషన్‌కు, సీపీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్



సాయంత్రం 6 గంటలకు అప్పుఘర్ 95వ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

ఎంవీపీ కాలనీ : స్థానిక అప్పుఘర్ ప్రాథమిక పాఠశాల 95వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో సోమవారం ఉదయం పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. సాంకేతిక సిబ్బంది ఆ కేంద్రానికి చేరుకుని ఈవీఎంకు మరమ్మతులు చేపట్టడంతో ఉదయం 9 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. దీంతో ఓట్లు వేసేందుకు కేంద్రానికి చేరుకున్న ఓటర్లు పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి చూడాల్సి వచ్చింది. దీంతో ఆ రద్దీ రాత్రి వరకు కొనసాగింది.

సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసేసరికి 200 మందికి పైగా ఓటర్లు అక్కడ క్యూలైన్‌లో వేచి ఉన్నారు. దీంతో వారందరికీ ఓటు వేసేందుకు అవకాశమిచ్చారు. సాయంత్రం తూర్పు ఎన్నికల అధికారి మయూర్ అశోక్ ఆ కేంద్రానికి చేరుకున్నారు. పోలింగ్ సిబ్బందితో కలిసి ఓటింగ్‌ను పర్యవేక్షించారు. ఓటింగ్ ఆలస్యమైన నేపథ్యంలో జాయింట్ పోలీసు కమిషనర్ పకీరప్పా పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల తరువాత ఓట్లు వేయాల్సిన వారు పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లిపోవాలని పోలీసులు మైక్‌లో ప్రచారం చేశారు. ఓట్లు వేసేందుకు వచ్చిన అందరినీ పోలింగ్ కేంద్రంలోకి పంపించి గేట్లు వేసేశారు. అనంతరం బయట ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పహరా కాశారు. రాత్రి 8.30 గంటల వరకు అక్కడ పోలింగ్ జరిగింది. 19వ వార్డు జాలరిపేటలో ఉదయం నుంచి ఓట్లు రద్దీ ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. రాత్రి 9 గంటల తరువాత కూడా అక్కడ పోలింగ్ కొనసాగింది.



బయట ఉన్న ఓటర్లు బూత్‌లోకి వెళ్లాలంటూ మైక్‌లో ప్రచారం చేస్తున్న పోలీసు అధికారులు

సత్యసాయి విద్యా విహార్‌లో శత శాతం ఉత్తీర్ణత

ఎంవీపీ కాలనీ: సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు సత్తా చాటారు. 2023–24కు విద్యా సంవత్సరానికి సంబంధించి 184 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 184 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 115 మంది విద్యార్థులు 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 32 మంది విద్యార్థులు 90 నుంచి 99 శాతం మార్కులు, 59 మంది 80 నుంచి 89 శాతం మార్కులు, 49 మంది 70 నుంచి 79 శాతం మార్కులు కైవసం చేసుకున్నారు. దీంతో పాటు 35 మంది విద్యార్థులు 60 నుంచి 69 శాతం మార్కులు సాధించారు. మాస్టర్ జి.శ్రీవాత్సవ్, కుమారి అదితి శతాక్షిలు 97.8 శాతం మార్కులతో స్కూల్ టాపర్స్‌గా నిలిచినట్లు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. పాఠశాల కన్వీనర్ ఎస్‌జీ చలం, ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి విద్యార్థులను అభినందించారు.

కర్ఫ్యూను తలపించిన రహదారులు



జనసంచారం లేక బోసిపోయిన అల్లిపురం

అల్లిపురం : ఒకపక్క ఎండ వేడి, మరో పక్క ఓట్ల పండగ కావడంతో సోమవారం అన్ని చోట్ల నిర్మానుష్య వాతావరణమే కనిపించింది. దాంతో పాటు ఎన్నికల నేపథ్యంలో లేబర్ హాలిడే ప్రకటించడంతో దుకాణాలన్నీ దాదాపు మూసివేయడంతో రోడ్లన్నీ జన సంచారం లేక బోసిపోయాయి. ఎన్నికల కేంద్రాల వద్ద మాత్రమే జనం బారులు తీరి కనిపించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.